క్లుప్తంగా

కార్మికులకు బహుమతులు ఇవ్వాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్‌ఓసీ కార్మికులకు స్పెషల్ గిఫ్ట్‌లు ఇవ్వాలని, టీబీజీకెఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్యలకు ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండి.రజాక్ ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించిన 10 మిలియన్ టన్నుల బొగ్గును కార్మికులు ఉత్పత్తి చేశారని, ఈ ఉత్పత్తి సింగరేణి సంస్థ చరిత్రలో ఏ ఓపెన్ కాస్ట్ సాధించలేదన్నారు. ఈ మేరకు బీ యాజమాన్యం నుంచి కార్మికులకు ప్రత్యేక బహుమతి అందజేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.సోమిరెడ్డి, నిమ్మల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పాల్వంచ: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ అధ్యక్షుడు చేపూరి బ్రహ్మచారి కుమారుడు కులదీప్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొత్తగూడెంలోని శ్రీ జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు, నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజమనోహర్, నవీన్, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29, 30వ తేదీల్లో కాంట్రాక్ట్ కార్మికుల మహాసభలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో ఈనెల 29, 30వ తేదీల్లో జరగనున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు కోరారు. పట్టణంలోని మంచికంటి భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడిగా కంచర్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సూరం అయిలయ్య, కోశాధికారిగా డి.వీరన్న తదితరులను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు సభల విజయవంతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ప్రమాదవశాత్తు గాయపడిన మెకానిక్ యాకూబ్ పాషాకు ఇల్లెందు మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన యాకూబ్ ఇంటికి వెళ్లి యూనియన్ నాయకులు పరామర్శించి రూ.10,400 అందజేశారు. ఈ కార్యక్రమంలో టూవీలర్ మెకానిక్ సంఘం అధ్యక్షుడు ఈసం రమేష్, కార్యదర్శి బసవరాజు రాంబాబు, గౌరవాధ్యక్షుడు మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు మరువలేనివి..


వైద్యులను సత్కరిస్తున్న అధికారులు

ఇల్లెందు: తల్లి జన్మనిస్తే.. పునర్జన్మను ఇచ్చే వైద్యుల సేవలు మరువలేనివని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఇల్లెందు వైసీఓఏ క్లబ్‌లో ఆదివారం జరిగిన డాక్టర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ జయరాజ్‌ను సత్కరించారు. అలాగే, జేకే ఓసీలో 'భద్రత – నా బాధ్యత' అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేయగా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ఎస్‌ఓ టూ జీఎం మల్లారపు మల్లయ్య, డాక్టర్ శారద, జగన్‌మోహన్‌రావు, ప్రాజెక్టు ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఇన్నయ్య, ఎస్.రంగనాథ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదమా.. నీవెక్కడ!?

కలగానే మిగిలిన చిల్డ్రన్స్ పార్క్, వాకింగ్ ట్రాక్, జిమ్

- మినీపార్క్‌ల్లో కానరాని పచ్చదనం, ఆట వస్తువులు
- దృష్టి సారించని కేటీపీఎస్ యాజమాన్యం


విద్యుత్ కళాభారతి పక్కన అలంకార ప్రాయంగా మారిన పార్కు

పాల్వంచ: రికార్డ్ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని అందిస్తు దేశంలోనే ప్రత్యేకత సంతరించుకుంది కేటీపీఎస్ కాంప్లెక్స్. అందుకు ఇక్కడి ఉద్యోగ, కార్మికులు ఎంతగానో కష్టపడి పనిచేస్తుంటారు. కానీ వారికి వసతులు కల్పించడంలో మాత్రం యాజమాన్యం సరైన దృష్టి సారించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక ఉద్యోగుల కాలనీల్లో ఆహ్లాదం మచ్చుకైన కానరావడం లేదనే విమర్శలు ఉన్నాయి. అతి పెద్ద విద్యుత్ కర్మాగారం ఉన్న ఉద్యోగుల కాలనీలో సరైన చిల్డ్రన్స్ పార్క్ లేకపోవడం గమనార్హం. మొక్కలు, ఆట వస్తువులు, పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు ఉన్న ఒక్క పార్క్ కూడా లేదు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో సుమారు 900 మంది ఉద్యోగులు, 1,800 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికోసం, వీరి కుటుంబాల కోసం కాలనీలో ఆకట్టుకునే విధంగా చిల్డ్రన్స్ పార్క్, వాకింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటు చేయడంలో యాజమాన్యం నాన్చుడి ధోరణి అవలంభిస్తుంది.

చిట్టడివిని తలపిస్తున్న మినీ పార్క్‌లు..

కేటీపీఎస్ ఉద్యోగుల కాలనీల్లోని విద్యుత్ కళాభారతీ గ్రౌండ్ ప్రక్కన మినీ పార్క్ ఉంది. అక్కడ ఒక్క మొక్క కూడా లేకపోగా, ఆట వస్తువులు ఒకటి రెండు ఉన్నా అవి పనికిరానివిగా మారాయి. కూర్చోడానికి బల్లాలు కూడా లేవు. మసీద్ పక్కన ఉన్న గ్రౌండ్ ప్రస్తుతం చిట్టడివిని తలపిస్తోంది. ఒక్క ఆట వస్తువు కూడా లేక పోగా చెట్లు భారీగా పెరిగి లోపలికి వెళ్లె వీలు కూడా లేకుండా ఆనవాళ్లు కోల్పోయింది. దుర్గా గ్రౌండ్‌లో పచ్చదనం హరించిపోయింది. ఆట వస్తువులు ఓ మూలకు ఉన్నా అవి అంతంత మాత్రమే. ఇక కాలనీలో లోపలో మరో పార్క్ స్థలం ఉన్నా అక్కడ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు.


అడవిని తలపిస్తున్న మసీద్ పక్కన గ్రౌండ్


వసతులు లేని దుర్గాగ్రౌండ్

దశాబ్ద కాలంగా వినతులు..

ఉద్యోగ, కార్మికులకు, వారి పిల్లలు, పెద్దలకు, అధికారులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా ఆట వస్తువులతో పెద్ద చిల్డ్రన్స్ పార్క్ కావాలని దశాబ్ద కాలంగా ఇక్కడి ఉద్యోగులు కోరుతున్నారు. యాజమాన్యానికి అనేక దఫాలుగా వినతి పత్రాలు అందించారు. కేటీపీఎస్ హాస్పిటల్ ముందు ఉన్న అతిపెద్ద ఖాళీ స్థలం ఇందుకు అనువైందని ఇటీవల జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావుకు దృష్టికి ఉద్యోగ, కార్మిక సంఘాలు వినతిపత్రాలను అందించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్, జిమ్‌లు ఏర్పాటు చేయాలని పలువురు ఉద్యోగ, కార్మికులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగూడెం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. కొత్తగూడెం ఒకటో వార్డు బూడిదగడ్డలో ఆదివారం ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని పేర్కొన్నారు. మరోపక్క ప్రతిపక్ష పార్టీలు సైతం సమస్యల పరిష్కారానికి పోరాడడం లేదని తెలిపారు. ఈమేరకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఎస్పీకి పట్టం కట్టాలని ఆయన కోరారు. నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, చెనిగారపు నిరంజన్ కుమార్, అల్లకొండ శరత్, జర్పుల కళ్యాణ్, గుగులోత్ కళ్యాణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాజు

పాల్వంచ: ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఆశ్రమ పాఠశాల నందు ఏర్పాటు చేసిన యుటీఎఫ్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బి.కిశోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు, ప్రమోషన్లు చేయాలన్నారు. అనంతరం సమస్యలపై సబ్‌కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తేజావత్ బాలు, కో కన్వీనర్‌గా బ.భాస్కర్, కె.సుబ్బారావు, డి.సురేశ్, బాలస్వామి, అనసూయ, 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ, ఎస్‌వి, జయరాజు, రాము, సీతారామయ్య, భాస్కర్, బాలు, వీరస్వామి, హరి, కె.రాంబాబు, వెంకన్న ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఎద్దులతో రైతులు..

రైతులకు ఎద్దుల పంపిణీ

పాల్వంచ: పట్టణ పరిధిలోని మంచికంటినగర్ నందు గల అన్నపూర్ణ గోశాలలో ఉన్న 40 ఎద్దులను ఆదివారం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయ శర్మ మాట్లాడుతూ... సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలని రైతులకు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయానికి ఉపయోగించుకునేలా ఒప్పంద పత్రంతో అందించడం జరిగిందన్నారు.

ట్రాన్స్‌ఫారం రెడీ..

- డయాలసిస్‌కు మార్గం సుగమం


ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందు: ఎట్టకేలకు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. కొంత కాలంగా ట్రాన్స్‌ఫారం లేదనే కారణంతో విద్యుత్ అప్ అండ్ డౌన్ అవుతోందని డయాలసిస్ సేవలు ప్రారంభించలేదు. గత నెల 27న డయాలసిస్ ప్రారంభించ లేదంటూ సాక్షిలో 'షురు కానీ డయాలసిస్' అంటూ ఓ కథనం ప్రచురితమయ్యింది. స్పందించిన విద్యుత్ అధికారులు హుటాహుటిన విద్యుత్ ట్రాన్స్‌ఫారంను ఏర్పాటు చేశారు. ఇక డయాలసిస్ సేవలు మాత్రమే మిగిలి ఉన్నాయి.

ఐక్యవేదిక కమిటీల ఏర్పాటు

ఇల్లెందు: సింగరేణిలో కళాకారుల ఐక్యవేదిక కార్యక్రమం ఆదివారం సింగరేణి రస్స్ అండ్ గోల్ఫ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరాంపూర్ సింగరేణి కళాకారుడు పులియాల సతీష్ మాట్లాడుతూ... సింగరేణిలో కళాకారులు ఎంతో మంది అనేక సమస్యలు అనుభవిస్తున్నారన్నారు. సింగరేణిలోని 11 డివిజన్లలో కళాకారుల ఐక్య వేదిక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సూర్యప్రకాష్, రాజలింగు, జలపతి, నజీర్ అహ్మద్, అజీజ్, తిరుమలరావు, కలవల వెంకటేశ్వర్లు, వేణు, జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జనగర్జనకు తరలిన నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఆదివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జనగర్జన సభకు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఆయన అభిమానులు, అనుచరులు అధిక సంఖ్యలో సభకు వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు ర్యాలీలు నిర్వహించి వాహనాల్లో కదలివెళ్లారు. ఈ మేరకు పోలీసులు చెక్‌పోస్ట్‌ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు.
– సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందురూరల్: మాణిక్యారం నుంచి సభకు తరలివెళ్తున్న ప్రజలు


జూలూరుపాడు: సభకు వెళ్తున్న నాయకులు


సుజాతనగర్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్టీఐ వెంకటరమణ, సీఐ శ్రీనివాస్


పాల్వంచరూరల్: పాల్వంచ ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీచేస్తున్న పోలీసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు


టేకులపల్లి: ఎస్‌బీఐ ఎదుట ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద...

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గుండెపుడి, గంగారంతండాకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, ఎదళ్లపల్లి వీరభద్రం, వేల్పుల నరసింహారావు, ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, సర్పంచ్‌లు గలిగె సావిత్రి, బానోత్ నరసింహారావు, లావుడ్యా కిషన్‌లాల్, ఎంపీటీసీ పెండ్యాల రాజశేఖర్, కృష్ణప్రసాద్, మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, ఎస్‌కె మైబూ, తిరుపతి, ప్రభాకర్, తాళ్లూరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి పంచాయతీ కార్మికుల సమ్మె


సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న ప్రసాద్


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న వెంకన్న

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 6 నుంచి నిర్వహించే పంచాయతీ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని, కేసీఆర్ బడుగు బలహీన వర్గాలపై వివక్ష వీడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో జరిగిన గ్రామపంచాయతీ వర్కర్ల జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు కనీస వేతనం చట్టం ప్రకారంగా రూ.26 వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని, పంచాయితీలల్లో కార్మికులు పనులు బంద్‌చేసి సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి మురళి, యూసఫ్, సురేష్, కిశోర్, మంజుల, సారయ్య,సున్నం జ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె తప్పదు

ఇల్లెందురూరల్: పంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఈనెల 6వ తేదీ నుంచి సమ్మె తప్పదని పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కో–కన్వీనర్ జటంగి వెంకన్న స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ గ్రామపంచాయతీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ మేరకు మండల స్థాయిలో జేఏసీని ఎన్నుకున్నామన్నారు. మండల కన్వీనర్‌గా తొగర సామేలు, కో–కన్వీనర్‌గా తాండ్ర కిరణ్, గుగులోత్ లక్ష్మణ్, పోశెట్టి గోపిలతోపాటు తొమ్మిది మంది సభ్యులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

వేతన ఒప్పందంతో సింగరేణి కార్మికులకు లబ్ధి


మాట్లాడుతున్న నర్సింహారావు

టేకులపల్లి: అనేక పోరాటాల ఫలితంగా సింగరేణి కార్మికులకు 11వ వేతన ఒప్పందం ప్రకారం నూతన వేతనాలు అందనున్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు మంద నర్సింహారావు తెలిపారు. మండలంలోని కోయగూడెం ఓసీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ, కార్మిక సంఘాల ఐక్యతతో కేంద్రప్రభుత్వం దిగొచ్చి వేతన ఒప్పందం అమలుచేస్తోందని తెలిపారు. కాగా, కోయగూడెం ఓసీ–3 బ్లాక్ ఒకే టెండర్ వచ్చినా కేంద్రప్రభుత్వం కట్టబెట్టడం గర్హనీయమన్నారు. ఈ విషయంలో గనులు వేలం వేయకుండా అడ్డుకునేందుకు పోరాఆటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సిరాజ్ అహమ్మద్, బానోత్ చందర్, కె వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై దాడి

పాల్వంచరూరల్: మండలపరిధిలోని పాండురంగాపురం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులపై పలువురు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేటకు చెందిన వెంకటనారాయణ, పాండురంగాపురానికి చెందిన మార్గం అంకయ్య మరికొంత మంది కలిసి కారులో పాండురంగాపురం గ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలో జనగర్జన సభకు రమ్మని పలువురు కారును ఆపారు. వారు దీనికి నిరాకరించినందుకు తమపై దాడిచేసి కారును ధ్వంసం చేశారని, మెడలోని గొలుసు కూడా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై శ్రీనివాస్‌ను వివరణకోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

అటెన్షన్ ప్లీజ్

వానొస్తే అవస్థే..

మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అండర్ రైల్వే వంతెన వద్ద అవస్థలు తప్పడం లేదు. వంతెన కింద పల్లం కావడంతో చిన్నపాటి వానకే ఈ ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. బురదలో వాహనాలు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.
– సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి :
ఖాజా మొహినుద్దీన్ ఖాన్,
ఎంపీఓ
సెల్ నంబర్ : 7093923790

గ్రామదేవతలకు బోనాల సమర్పణ


టేకులపల్లి: బోనాలతో వెళ్తున్న మహిళలు..

టేకులపల్లి: మండలంలోని చంద్రుతండా, కొండెంగులబోడు గ్రామంలో ఆదివారం ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో గ్రామాలకు చెందిన మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


చంద్రుతండాలో..